సాక్షి
అనంతపురం
సోమవారం । 20 । జనవరి । 2025



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



చూడచక్కని కోట

రాచరిక దర్పాన్ని చూడాలనుకుంటే సీమ దుర్గాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచిన గుత్తి దుర్గాన్ని తప్పక సందర్శించాల్సిందే. కోటలోని ప్రతి అణువుకూ ఓ చరిత్ర ఉంది.

8లో

గరిష్టం/కనిష్టం
33.4°/14.3°

జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు



అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించడం లేదని డీఆర్‌ఓ ఎ.మలోల తెలిపారు. ఎస్సీ ఉప వర్గీకరణపై అభిప్రాయాల సేకరణకు ఏకసభ్య కమిషన్ విచ్చేస్తున్న నేపథ్యంలో పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు. రెవెన్యూ డివిజన్లు, మండల కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందని, అర్జీలను అక్కడే సమర్పించాలని తెలియజేశారు.

అంగన్‌వాడీల్లో ఆధార్ క్యాంపులు

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఆదేశించారు. ఒకవేళ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహణకు సౌకర్యాలు లేకుంటే సచివాలయాల్లోనైనా ఏర్పాటు చేయాల్సిందేనని, అందుకు సీడీపీఓలు, సూపర్‌వైజర్లు చొరవ చూపాలని స్పష్టం చేశారు. మండల స్థాయి సమావేశాల అనంతరం ఏ రోజు ఎక్కడ క్యాంపు నిర్వహించేది అధికారులు తేదీలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు విధిగా ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి పిల్లాడికి సంబంధించిన రిమార్క్స్ కచ్చితంగా నమోదు చేయాలని, సమస్యలు ఏమైనా ఉంటే ఆధార్ విభాగం జిల్లా కో–ఆర్డినేటర్ నారప రెడ్డిని సంప్రదించాలని సూచించారు.

వలస బాటలో మృత్యువాత



విశ్వనాథ్ (ఫైల్)

రాయదుర్గం: రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృత్యువాత పడ్డాడు. అయిన వారికి తీరని శోకం మిగిల్చాడు. వివరాలు.. రాయదుర్గం మండలంలోని రాయంపల్లికి చెందిన విశ్వనాథ్ (38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికంగా ఎక్కడా ఉపాధి దొరక్కపోవడంతో కుటుంబ పోషణ కోసం కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు 15 రోజుల క్రితం విశ్వనాథ్ వలస వెళ్లాడు. అక్కడ కూలీ పనులకు వెళ్తూ వారానికోసారి భార్యకు నగదు పంపుతూ ఉండేవాడు. ఈ క్రమంలోనే గత ఆదివారం పని ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన అతడిని స్థానికులు అక్కడి ఓ ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులు మృత్యువుతో పోరాడిన విశ్వనాథ్.. ఆదివారం ప్రాణాలు వదిలాడు. పెద్ద దిక్కు మృతితో భార్య, పిల్లలు రోడ్డున పడ్డారు. మండలంలో ఉపాధి పనులు సక్రమంగా కల్పించకపోవడంతోనే వలసలు పెరుగుతున్నాయని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రూ.27 లక్షల పత్తి.. ఆహుతి



కాలిపోయిన పత్తి సంచులు

రాప్తాడు: మండల కేంద్రం సమీపంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లారీలో తరలిస్తున్న పత్తి దగ్ధమైంది. లారీ డ్రైవర్ సెవెన్ జంగమ్ తెలిపిన మేరకు... మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్ జిల్లా షేగావ్ తాలూకాలో ఉన్న రిద్దిసిద్ది కోట్యాక్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ.27,23,242 విలువ చేసే 17 టన్నుల పత్తిని తమిళనాడులోని మినపరాయ్ స్పిన్నింగ్ మిల్‌కు కేఏ01ఏఎం 1460 నంబర్ గల లారీలో తరలింపు చేపట్టారు. శనివారం రాత్రి 8.30 గంటలకు రాప్తాడు వద్ద జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ లారీని ఆపి అక్కడే ఉన్న హోటల్‌లో భోజనం చేశారు. అనంతరం లారీ వద్దకు చేరుకోగా అప్పటికే పొగలు వస్తుండడం గమనించి వెంటనే టార్పాలిన్‌ను తొలగించాడు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో పత్తి బేళ్లను కిందకు పడేయడంతో లారీకి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

విశ్వతేజం.. తగ్గనున్న వైభవం



జేఎన్‌టీయూ (ఏ) పాలక భవనం

రాయలసీమకే తలమానికంగా నిలిచి.. ఎంతో మందిని గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్ది దేశంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న జేఎన్‌టీయూ (ఏ) వైభవం క్రమంగా తగ్గుతోంది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ఇంజినీరింగ్ కళాశాలలు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా పొందుతుండటంతో వర్సిటీ పరిధి కుంచించుకుపోతోంది. త్వరలో కేవలం కాగితాలకే కార్యకలాపాలు పరిమితం కానున్నాయి.

- జేఎన్‌టీయూ పరిధిలో అనుబంధ కళాశాలలకు అటానమస్
- ఇప్పటికే 40 కాలేజీలకు మంజూరు.. వచ్చే ఏడాది మరిన్నింటికి హోదా
- నూతన జాతీయ విద్యా విధానంలో వెసులుబాటే కారణం
- త్వరలో పర్యవేక్షణ వరకే పరిమితం కానున్న వర్సిటీ

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో మొత్తం 90 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, ఇప్పటికే 40 కళాశాలలకు అటానమస్ హోదా దక్కింది. తక్కిన 50 కళాశాలల్లో సింహభాగం వచ్చే ఏడాది అటానమస్ హోదా పొందనున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీ అధికారాలు కనుమరుగవుతాయి. జిల్లాలో రెండింటికి మినహా అన్ని కళాశాలలకూ అటానమస్ హోదా దక్కింది. ఆ రెండు కూడా 'అటానమస్'కు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

నూతన విద్యా విధానంతో బాటలు..



నూతన జాతీయ విద్యా విధానం -2020 ప్రకారం ప్రతి ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలలకు అటానమస్ హోదా ఉండాలి. గతంలో ఆ హోదా దక్కాలంటే శాశ్వత అనుబంధ హోదాతో పాటు న్యాక్‌లో మెరుగైన గ్రేడింగ్ దక్కించుకోవాల్సి ఉండేది. అయితే, నూతన విద్యా విధానంలో భాగంగా నిబంధనలు సరళీకరించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కళాశాలకూ అటానమస్ హోదాను కట్టబెడుతున్నారు. అటానమస్ అయితే విద్యా ప్రణాళిక, సిలబస్ రూపకల్పన, ప్రోగ్రాం అమలు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, పరీక్ష ఫలితాల విడుదల వరకు స్వతంత్రంగా వ్యవహరించవచ్చు. మార్కులను వర్సిటీకి పంపితే.. స్నాతకోత్సవ డిగ్రీని వర్సిటీ తన పేరున ప్రదానం చేస్తుంది.

ప్రైవేట్ వర్సిటీల బాటలో..

పలు ఇంజినీరింగ్ కళాశాలలు ప్రైవేట్ వర్సిటీలుగా మారేందుకు కూడా ప్రయత్నిస్తున్నాయి. కోర్సుల ఫీజులను కూటమి ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో చాలా కళాశాలలు ఆ బాట పట్టినట్లుగా తెలుస్తోంది. ప్రైవేట్ వర్సిటీగా మారితే సీట్ల పెంపు, కొత్త కోర్సులను ప్రవేశపెట్టుకునే అవకాశం లభిస్తుంది. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ నామమాత్రంగానే ఉంటుంది. ప్రవేశాల నుంచి పరీక్షల నిర్వహణ, మార్క్స్‌కార్డుల జారీ వరకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేసుకునే అధికారం ప్రైవేట్ వర్సిటీకి ఉంటుంది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రైవేట్ వర్సిటీల ఏర్పాటుకు 'యూజీసీ' (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) సైతం సుముఖంగా ఉంది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో ఇప్పటికే మోహన్‌బాబు, అన్నమాచార్య ప్రైవేట్ యూనివర్సిటీలు ఏర్పడ్డాయి. మిట్స్ (మదనపల్లి), ఆర్జీఎం (నంద్యాల), పుల్లారెడ్డి (కర్నూలు), ఆదిశంకరాచార్య, ఎస్వీ సెట్ (చిత్తూరు), కేఎస్‌ఆర్ఎం (కడప), ఎస్వీ ఐటీ (తిరుపతి) కళాశాలలు ప్రైవేట్ వర్సిటీలుగా మారేందుకు దరఖాస్తు చేసుకున్నాయి.

సొంతంగా ఫీజుల నిర్ణయం..

ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజులను ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఖరారు చేస్తుంది. కానీ, ప్రైవేట్ వర్సిటీలు స్వతహాగా ఫీజులను నిర్ణయించుకోవచ్చు. విద్యార్థుల నుంచి వసూలు చేసుకోవచ్చు. కేవలం 30 శాతం విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పిస్తుంది. ప్రైవేటు వర్సిటీలపై ప్రభుత్వ నియంత్రణ కూడా ఎక్కువగా ఉండదు. గత ప్రభుత్వంలో ప్రతి క్వార్టర్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేది. కూటమి ప్రభుత్వంలో సకాలంలో ఫీజులు అందడం ప్రశ్నార్థకంగా మారడంతో ప్రైవేటు వర్సిటీల వైపు మొగ్గు చూపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అటానమస్ దరఖాస్తులు పెరిగాయి



అటానమస్ హోదా కోసం దరఖాస్తు చేసుకునే జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల సంఖ్య గణనీయంగా పెరిగింది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రతి కళాశాల 'స్వయం ప్రతిపత్తి' గల కళాశాలగా ఉండాలి. వినూత్నమైన పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా మారాలి. మారిన నిబంధనల నేపథ్యంలో 'అటానమస్' వైపు యాజమాన్యాలు అడుగులు వేస్తున్నాయి.

– ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్,
డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్,
జేఎన్‌టీయూ(ఏ)

సీసీ రోడ్డుపై వాటర్ ప్లాంట్

- 'పచ్చ' నేత బరితెగింపు



గొందిరెడ్డిపల్లిలో టీడీపీ నేత సీసీ రోడ్డుపై నిర్మించిన వాటర్ ప్లాంట్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తున్న రాప్తాడు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల ఆగడాలు పెచ్చుమీరాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భూములు, స్థలాలు, చివరకు ప్రైవేటు ఆస్తులతో పాటు శ్మశాన స్థలాలను సైతం వదలకుండా 'పచ్చ' నేతలు కబ్జా చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాప్తాడు మండలంలోని గొందిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ నేత కుమ్మర నాగేంద్ర మరింతగా బరితెగించాడు. ఏకంగా సీసీ రోడ్డును కబ్జా చేసి వాటర్ ప్లాంట్ నిర్మించాడు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్ అని పేరు కూడా పెట్టాడు. భవనంపై ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్, పరిటాల రవి, ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ, ఎమ్మెల్యే సోదరుడు ధర్మవరపు మురళీ ఫొటోలు వేయించాడు. గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పంచాయతీ అనుమతి తీసుకోవాల్సి ఉన్నా, పొందలేదు. రోడ్డుపై ప్లాంట్ నిర్మించకూడదంటూ గ్రామ ప్రజలు అడ్డు పడితే తీవ్రంగా బెదిరించాడు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాంటు ఏర్పాటు చేయడంతో సర్పంచు మిడతల శీనయ్య అనుమతి ఇవ్వలేదు. శీనయ్య టీడీపీ సానుభూతి పరుడే కావడం గమనార్హం. దీన్ని బట్టి నాగేంద్ర ఎంతలా బరితెగించాడో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుపై నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.





అనంతపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద భిక్షమెత్తుకుంటున్న వృద్ధుడు వెంకటరమణ, రోడ్డు పక్కనే భోజనం చేస్తున్న వృద్ధురాలు కుళ్లాయమ్మ

అందరూ ఉన్నా అనాథలై..

అయిన వారు ఉన్నా ఆ వృద్ధులు అనాథలయ్యారు. బిడ్డల కర్కశత్వంతో రోడ్డున పడ్డారు. బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లికి చెందిన కుళ్లాయమ్మకు ఇద్దరు కుమార్తెలు. భర్త బాలప్ప మరణించాడు. ఇద్దరు కుమార్తెలకూ పెళ్లిళ్లయ్యాయి. కుళ్లాయమ్మకు నెలానెలా పింఛన్ వస్తోంది. అమ్మ నుంచి సగం డబ్బు లాక్కుంటున్న కుమార్తెలు.. ఆ తర్వాత మాత్రం పట్టించుకోవడం లేదు. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన వృద్ధుడు వెంకటరమణది కూడా ఇదే పరిస్థితి. దీంతో వీరు.. అనంతపురంలో భిక్షమెత్తుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జన్మనిచ్చిన వారిని విస్మరిస్తున్న వారికి ఎప్పుడు బుద్ధి వస్తుందో అంటూ సాటి వృద్ధులు ఆవేదన చెందుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

మహనీయుడు యోగి వేమన



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ తదితరులు

అనంతపురం అర్బన్: సమాజంలోని వాస్తవికతను పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో తన పద్యాల ద్వారా వివరించిన మహనీయుడు యోగి వేమన అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన వేమన జయంతి కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల ముఖ్య అతిథులుగా హాజరై వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేమన ప్రతి పద్యం సమాజంలోని పరిస్థితులకు అద్దం పడుతుందన్నారు. మధ్య యుగంలో యోగి వేమన వంటి కవులు సులభమైన వాడుక భాషతో సాంస్కృతిక విప్లవానికి నాంది పలికారన్నారు. 500 ఏళ్ల పద్యాలు ఇప్పటికీ వాడుకలో ఉన్నాయని, వీటిని మరింత ముందుకు తీసుకువెళ్లే బాధ్యత అందరిపై ఉందన్నారు. పురాతన చరిత్ర, ఇతిహాసాలకు చెందిన దాదాపు 500 పుస్తకాలు కలెక్టరేట్‌లో ఉన్నాయన్నారు. వీటన్నిటికి అంకెలు వేసి కలెక్టర్ కార్యాలయంలో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి జయకుమార్‌బాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, విభాగాల సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, కవులు ఏలూరు యంకన్న, శ్రీనివాసరెడ్డి, మధురశ్రీ, కృష్ణమూర్తి, అప్పస్వామి, రామ్మోహన్‌రెడ్డి, రియాజుద్దీన్, కంబదూరు నబీరసూల్, నాగభూషణం, నారాయణరెడ్డి, రషీద్ పాల్గొన్నారు.

సర్వేకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 31 పైలెట్ గ్రామాల్లో రీ సర్వే
- 155 బృందాల ఏర్పాటు
- గత ప్రభుత్వంలోనే 503 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై
- జగన్ సర్కారు చర్యలతో సులువు కానున్న ప్రక్రియ



గతంలో రీ సర్వేలో భాగంగా రైతుల సమక్షంలో హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎంపిక చేసిన 31 గ్రామాల్లో సోమవారం నుంచి భూముల రీ సర్వే ప్రారంభం కానుంది. ఏళ్లుగా నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమగ్ర రీ సర్వే ప్రక్రియ చేపట్టింది. ఇందుకు పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. సర్వే క్రమంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి ప్రత్యేకంగా మండలానికి ఒక డిప్యూటీ తహసీల్దారును మొబైల్ మెజిస్ట్రేట్‌గా నియమించింది. జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 32 మండలాల్లో 25,17,658.52 ఎకరాల రీ సర్వే చేశారు. అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లై ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) చిత్రాలను తీశారు. అదే క్రమంలో 198 గ్రామాల్లోని 1,83,353 భూ కమతాలకు చెందిన 5,88,615.626 ఎకరాలు సర్వే చేశారు. హద్దులు నిర్ధారిస్తూ రాళ్లు ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం సర్వే చేయాల్సిన గ్రామాలు	305
సర్వేకు ఉపయోగించే రోవర్లు	158
పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న గ్రామాలు	31
గత ప్రభుత్వంలో సర్వే చేసిన గ్రామాలు	503
సర్వే చేసిన విస్తీర్ణం (ఎకరాల్లో)	5,88,615.626

అంతా పక్కాగా..

రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో ఇటీవల అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు సభలను నిర్వహించారు. 1,83,353 భూ కమతాలకు గానూ 5,421 ఫిర్యాదులు (0.03 శాతం) మాత్రమే వచ్చాయంటే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్వే ఎంత పకడ్బందీగా చేశారనే విషయం స్పష్టమవుతోంది. ఈ క్రమంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రీ–సర్వే కోసం తయారు చేసిన వ్యవస్థ... ప్రస్తుత కూటమి సర్కారుకు 'వడ్డించిన విస్తరి' అవుతోందంటే అతిశయోక్తి కాదు.

ఐదు బృందాలతో..

జిల్లావ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామం చొప్పున 31 మండలాల పరిధిలో 31 గ్రామాల్లో రీ–సర్వే ప్రక్రియను సోమవారం ప్రారంభించనున్నారు. 31 గ్రామాల్లో 1,26,618.760 ఎకరాలు సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతి గ్రామంలో 200 ఎకరాల నుంచి 250 ఎకరాల వరకు ఒక బ్లాక్‌గా మొత్తం 31 గ్రామాల్లో 506 బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. సర్వే చేసేందుకు ఒక్కో గ్రామానికి ఐదు బృందాలు నియమించారు. ఇలా 31 గ్రామాలకు 155 బృందాలు పనిచేస్తాయి. గ్రామాల్లో సర్వేకు 158 రోవర్లను ఉపయోగిస్తున్నారు.

అన్ని చర్యలూ చేపట్టాం



భూముల రీ–సర్వేకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన 31 గ్రామాల్లో 20వ తేదీన సర్వే ప్రారంభిస్తున్నాం. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాము. ప్రతి గ్రామంలోనూ ఐదు బృందాలు పనిచేస్తాయి.

– రూప్లానాయక్, ఏడీ,
సర్వే భూ రికార్డుల శాఖ

సందడిగా 10 కే రన్.. 5కే వాక్



జెండా ఊపి 5కే వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం: నగరంలో ఆదివారం 10కే రన్, 5కే వాక్ సందడిగా సాగాయి. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలను స్థానిక కలెక్టరేట్ వద్ద కలెక్టర్ వినోద్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణించాలని పిలుపునిచ్చారు. స్పెయిన్ నుంచి వచ్చిన వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఐఏఎస్ శిక్షణ సమయంలో ముస్సోరిలో నిర్వహించిన ఇలాంటి కార్యక్రమంలో 11వ స్థానంలో నిలిచినట్లు గుర్తు చేసుకున్నారు. కాలికి చిన్న గాయమైన కారణంగా పోటీల్లో పాల్గొనలేకపోతున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ 'అల్బా ఫెర్రర్ రన్నింగ్' పది సంవత్సరాల క్రితం ప్రారంభమైందన్నారు. పెద్ద ఎత్తున రన్నర్స్ రావడం సంతోషంగా ఉందన్నారు. గతంలో స్పెయిన్ నుంచి ఎక్కువ మంది వచ్చేవారని, కానీ ఇప్పుడు జిల్లా నుంచే చాలా మంది రన్నర్స్ పాల్గొనడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శ్రీనివాస రెడ్డి, ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, అల్బా రన్నర్ జువాన్ వియోరా తదితరులు పాల్గొన్నారు.



10కే రన్‌లో పాల్గొన్న స్పెయిన్ దేశస్తులు, నగరవాసులు

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


అబ్దుల్లా (ఫైల్)

రాయదుర్గం టౌన్: స్థానిక నేతాజీ రోడ్డులోని తాజ్ జిన్నా ప్రాంతానికి చెందిన అబ్దుల్లా (42) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య ముంతాజ్, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గార్మెంట్స్ పరిశ్రమలో జీన్స్ కటింగ్ మాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదనకు లోనయ్యాడు. పాఠశాలకు సెలవు కావడంతో పిల్లలను పిలుచుకుని ముంతాజ్ గుండ్లపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న అబ్దుల్లా ఉరి వేసుకున్నాడు. గమనించి చుట్టుపక్కల వారు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అబ్దుల్లా మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మానేయమంటే.. ప్రాణం తీసుకున్నాడు!


మృతుడు రాజన్న


కంబదూరు: మద్యం మానేయడం ఇష్టంలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం ఓబగానిపల్లికి చెందిన రాజన్న (29) మొదటి భార్య మృతి చెందింది. దీంతో 30 రోజుల క్రితం రెండో పెళ్లి చేసుకున్నాడు. మద్యానికి బానిస కావడంతో రోజూ తప్పతాగి ఇంటికి చేరుకునేవాడు. శనివారం రాత్రి కూడా మద్యం మత్తులో ఇంటికి చేరుకోవడంతో తల్లి నాగమణి, భార్య చైత్ర మందలించారు. రోజూ మద్యం తాగుతూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని, ఏదైనా పని చేసుకుంటూ గౌరవంగా బతుకుదామని హితవు పలికారు. అయితే మద్యానికి పూర్తి స్థాయిలో బానిసైన రాజన్న... అదే రోజు రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇంట్లో వారు గమనించేలోపు ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రవీణ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రిమాండ్‌కు 11 మంది


పెనుకొండ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన వివాహితపై దాడి కేసులో 20 మందిపై కేసు నమోదు కాగా, 11 మందిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు కియా పీఎస్ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. వివరాలు... పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన ఓ వివాహితపై గత బుధవారం దాడి జరిగిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన మైనర్ బాలిక ప్రేమ వ్యవహారంలో ఆమె ప్రమేయం ఉందనే అపోహతో బాలిక కుటుంబసభ్యులు, బంధువులు దాడి చేసి జుత్తు కత్తిరించి అవమానించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ప్రధాన నిందితులు డి.శంకర, లక్ష్మీదేవి, రామస్వామితో పాటు సుబ్బలక్ష్మి, సుబ్బమ్మ, రమేష్, శాంతి, ధనలక్ష్మి, రమణ, సుందరమ్మ, అనితను ఆదివారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో తొమ్మిది మంది కోసం పోలీసులు గాలిస్తున్నారు.

చూడచక్కని కోట


ఎత్తయిన రాతి గోడలతో శత్రుదుర్భేద్యంగా నిర్మించిన గుత్తి కోట


సైనిక పహారా కోసం నిర్మించిన బురుజు

రాచరిక దర్పాన్ని చూడాలనుకుంటే సీమ దుర్గాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచిన గుత్తి దుర్గాన్ని తప్పక సందర్శించాలి. ఈ కోటలోని ప్రతి అణువుకూ ఓ చరిత్ర ఉంది. ఆసక్తిగా చూస్తే ప్రతిదీ అద్భుతంగానే కనిపిస్తుంది. అక్కడున్న శాసనాలను బట్టి క్రీ.శ. 7వ శతాబ్దంలో నిర్మితమైన ఈ కోట శత్రుదుర్భేధ్యంగా ఖ్యాతిగాంచింది. కోట శిఖరాగ్రానికి చేరుకున్న తర్వాత కనుచూపు మేర కనిపించే ఎత్తయిన రాతి గోడలు 'ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా'ను మరిపిస్తాయి. ప్రకృతి రమణీయమైన అందాలతో చూపరుల మనస్సు దోచేస్తున్న కోటలో 101 బావులు, 15 బురుజులు, 15 ముఖద్వారాలు, గజశాలలు, గుర్రపు శాలలు, చీకటి గదులు, దర్బార్ మంటపం, సొరంగాలు ఇలా అనేకం ఉన్నాయి. మరాఠులు, విజయనగర రాజులు, చాళుక్యులు, చోళులు ఇలా 22 రాజ వంశాలు పాలించాయి. ఎప్పుడన్నా కుటుంబంతో సహా బయటకు వెళ్లాలంటే అందమైన.. చూడచక్కని.. చూడక తప్పని ప్రదేశాల్లో ఒక్కటిగా ఉన్న గుత్తి కోటను సందర్శిస్తే మనతో పాటు చిన్నారుల మేథో విజ్ఞాన వికాసానికి బాటలు వేసినట్లవుతుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


కోట ముఖద్వారాల్లో ఒకటి


కోట సందర్శనకు వచ్చిన విద్యార్థినులు


పైనుంచి చూస్తే కనిపించే దర్బార్ మంటపం, నివాస మందిరాలు


గుత్తి కోట పాదంలో ఉన్న జిల్లా తొలి కలెక్టర్ థామస్ మన్రో సమాధి


నేటికీ చెక్కుచెదరని గజశాలల అంతర్భాగం


రాణీవాసం సమీపంలోని కోనేరు

హంద్రీ–నీవా లక్ష్యాలు దెబ్బతీస్తే సహించం


సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసులు

- ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

గుంతకల్లు టౌన్: హంద్రీ–నీవా ప్రాజెక్టు లక్ష్యాలు దెబ్బతీస్తే సహించబోమని కూటమి సర్కార్‌ను ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలసాధన సమితి రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు. ప్రాజెక్ట్ నిర్దేశిత లక్ష్యాలకు సమాధి కట్టేలా సీఎం చంద్రబాబు జారీ చేసిన జీఓ 404, 405ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గుంతకల్లప్ప స్వామి కల్యాణమంటపంలో జలసాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు విశిష్ట అతిథులుగా పౌర ప్రగతిశీల వేదిక కార్యదర్శి ధాయిపూలే తారకేష్ రావు, ప్రముఖ న్యాయవాది ఓపీడీఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హంద్రీ–నీవా ప్రధాన కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచుతూ రూ.6,182 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసిందని గుర్తు చేశారు. అయితే ఎన్నికల నేపథ్యంలో ఈ పనులు ముందుకు సాగలేదన్నారు. ఆ తర్వాత ఏర్పాటైన కూటమి ప్రభుత్వం... గత ప్రభుత్వం జారీ చేసిన పరిపాలన అనుమతులను రద్దు చేస్తూ ప్రాజెక్టు ప్రయోజనాలకు సమాధి కట్టేలా జీఓ 404, 405ను విడుదల చేయడం సిగ్గు చేటన్నారు. ఈ జీఓల ప్రకారం పనులు చేపడితే కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం కేవలం 3,850 క్యూసెక్కులకే పరిమితమవుతుందన్నారు. అమరావతి అభివృద్ధి పేరుతో రూ.వేల కోట్లను ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వం రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న ప్రతిసారీ రాయలసీమ ప్రాంతానికి చంద్రబాబు తీరని మోసం చేస్తూనే ఉన్నారని ధ్వజమెత్తారు. సీమ అభివృద్ధికి గండి పడుతున్నా.. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. హంద్రీ–నీవా ప్రధాన కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కుల పెంచడంతో పాటు ఉమ్మడి జిల్లాలో పిల్ల కాలువల ఏర్పాటు చేసి 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జీఓ.404,405ను రద్దు చేసే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. సదస్సులో న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ఎర్రిస్వామి, దావిద్, ఆశాబీ, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ దేవర



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పెద్దమ్మ, అమ్మవారి విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో పెద్దమ్మ దేవర ఆదివారం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. గ్రామంలో 13 ఏళ్ల తర్వాత నిర్వహించిన దేవర కావడంతో ప్రతి ఇంటా రెండు నుంచి 10 పొట్టేళ్ల వరకు అమ్మవారికి మొక్కుబడి కింద బలి ఇచ్చారు. బంధుమిత్రులకు విందు ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం కడవకల్లు గ్రామం జనసంద్రమైంది. పలు రాజకీయ పార్టీల నాయకులు దేవర మహోత్సవానికి హాజరైయ్యారు.

నేడు చౌడేశ్వరీ జ్యోతుల మహోత్సవం..

పెద్దమ్మ దేవర మహోత్సవంలో భాగంగా సోమవారం చౌడేశ్వరీ జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలు ఆదివారం వెల్లడించారు. గ్రామంలోని చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఇస్తెమా


ఇస్తెమాలో పాల్గొన్న ముస్లింలు

నార్పల: మండల కేంద్రంలో జరుగుతున్నా జిల్లా స్థాయి ఇస్తెమాలో పలువురి ప్రసంగాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించాయి. ఆదివారం వేలాది ముస్లింలు హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరిపారు. వైద్యాధికారి ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


వజూ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన వేడి నీటి సౌకర్యం

రెవెన్యూ ఉద్యోగుల స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం అనంతపురంలోని కృష్ణకళామందిర్‌లో ఉన్న రెవెన్యూ హోమ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గొని సంజీవ రెడ్డి, కార్యదర్శిగా పుట్లూరు హరిప్రసాదరెడ్డి, కోశాధికారిగా కె.శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షులుగా టి.హరిప్రసాద్, చంద్రరేఖ, పి.మూర్తి, ప్రసాదరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా పి.నారాయణస్వామి, ఎస్.షాహిద్ అక్రమ్, డి.భరత్ ఎన్నికయ్యారు. నూతన సభ్యులను డీఆర్‌ఓ మలోల, ఆర్‌డీఓ కేశవనాయుడు అభినందించారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

పాడి ఆవును బలిగొన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

పుట్టపర్తి అర్బన్: ప్లాస్టిక్ వ్యర్థాలు తిన్న ఓ పాడి ఆవు మృతి చెందింది. వివరాలు.. పుట్టపర్తి మండలం గువ్వలగుట్టపల్లికి చెందిన గోపాలరెడ్డి ప్రభావతి దంపతులు పాడి పోషణతో జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది రూ.80 వేలు వెచ్చించి ఓ ఆవును కొనుగోలు చేశారు. రోజూ పది లీటర్ల మేర పాలు ఇస్తున్న ఈ ఆవు వారం రోజులుగా మేత మేయక తీవ్ర అనారోగ్యం బారిన పడింది. గోరంట్లకు చెందిన పశు వైద్యుడు శివారెడ్డితో చికిత్స చేయించారు. అయినా ఫలితం దక్కక ఆదివారం మృత్యువాతపడింది. పశువైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహిస్తే ఆవు పొట్ట నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు, చీరలతో పేనిన తాడు వ్యర్థాలు బయటపడ్డాయి. గమనించిన రైతు దంపతుల బోరున విలపించారు.


వ్యక్తి దుర్మరణం

లేపాక్షి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని జీలగుంట గ్రామానికి చెందిన వెంకటేష్(45) వ్యక్తిగత పనిపై హిందూపురానికి శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. లేపాక్షి మండలం వెంకటాపురం క్రాస్ వద్దకు చేరుకోగానే ద్విచక్ర వాహన వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

మర్తాడులో చోరీ

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు గ్రామంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన హాజీబాషా తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి ఈ నెల11న అనంతపురంలో బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన దుండగులు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని 12 తులాల వెండి, ఒక తులం బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించారు. ఆదివారం ఇంటికి చేరుకున్న హాజీబాషా చోరీ విషయాన్ని నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'బొప్పాయి'లో యాజమాన్యం పాటించండి





రోటరీపురంలో సాగు చేసిన బొప్పాయి పంట (ఇన్‌సెట్) కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మాధవి

బుక్కరాయసముద్రం: బొప్పాయి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు ఉంటాయని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,500 ఎకరాల్లో బొప్పాయి సాగులో ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బొప్పాయి పంటకు మంచి డిమాండ్ ఉందని, ఈ క్రమంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చునన్నారు. బొప్పాయి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను ఆమె వివరించారు.

సమగ్ర యాజమాన్యం ఇలా..

బొప్పాయి సాగు చేయాలనుకునే రైతులు తొలుత ఆరోగ్యవంతమైన మొక్కను ఎంపిక చేసుకోవాలి. కోవన్, 786 రెడ్‌లేడీ, కూర్గ హనేడ్యు, సోలో, పుసా మెజిస్టీ, సన్ రూజ్ సోలో, సూర్య, ఆర్క ప్రభాత్, వాషింగ్టన్ వంటి రకాలు అందుబాటులో ఉన్నాయి. ఎకరాకు 1000 మొక్కలు చొప్పున నాటుకోవాలి. మొక్కకు మొక్కకు మధ్య 6X7 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. మొక్కల గుంతలోకి పశువులఎరువు, వేప పిండి వేసుకోవాలి. విత్తనాలైతే ఒక సెంటీమీటరు లోతు మించకుండా విత్తుకోవాలి. విత్తు వేసే ముందు భూమిని 30 నుంచి 40 సెంటీమీటర్ల లోతుతో దుక్కి చేయాలి.

తెగుళ్ల యాజమాన్యం

బొప్పాయి సాగులో వైరస్ తెగుళ్లు ఎక్కువగా ఉంటాయి. వీటిలో ఆకు ముడత, రింగ్ స్పాట్ వైరస్ ప్రధానమైనవి. రసం పీల్చే పురుగులు బొప్పాయి నారను ఆశించకుండా 40X60 అడుగుల పరిమాణమున్న లాన్ మెష్ నెట్ హౌస్‌లో పెంచాలి. బొప్పాయి తోట సాగు సమయంలో చుట్టూ రెండు వరుసల మొక్కజొన్న లేదా అవిశను రక్షణగా వేయాలి. ఇలా చేయడం ద్వారా రసం పీల్చే పురుగును నివారించవచ్చు. రసం పీల్చే పురుగుల నివారణకు లీటరు నీటికి 2.5 మిల్లీ వేప నూనె, 2.5 గ్రాముల అసిపేట్ కలిపి పిచికారీ చేయాలి. రింగ్‌స్పాట్ వైరస్ నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, 1.5 గ్రాముల జింక్ సల్ఫేట్, 1. గ్రాము బోరాక్ కలిపి పిచికారీ చేయాలి. కాండం కుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి 1 గ్రాము బోర్డో మిశ్రమం, 2 గ్రాముల అలియేట్ కలిపి వారం రోజుల వ్యవధిలో 2, 3 సార్లు మొక్క మొదలు బాగా తడపాలి. బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి గంధకం (నీటిలో కరిగే) 3 గ్రాములు, 2 మి.లీ. కెరాథేన్ (1 మి.లీ.) కలిపి చెట్లపై పిచికారీ చేయాలి.



పంట కోత, దిగుబడి

ఎకరాకు వెయ్యి బొప్పాయి మొక్కలు చొప్పున నాటుకుంటే 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పంట సాగు చేసిన 7 నెలల కాలం నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కటింగ్ వస్తుంది. ఇలా 5 నుంచి 8 నెలల వరకు పంట కోతకు వస్తుంది. తర్వాత కూడా ఏడాదిన్నర పాటు పంట వస్తుంది. అయితే కాయ పరిమాణంలో మార్పు ఉంటుంది. ఒక ఎకరా పొలంలో బొప్పాయి సాగుకు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బొప్పాయి రూ. 14 నుంచి రూ.17 చొప్పున అమ్ముడు పోతోంది. ఈ లెక్కన టన్ను బొప్పాయికి రూ.17 వేల చొప్పున ఎకరాకు రూ.4లక్షల వరకు కచ్చితమైన ఆదాయం ఉంటుంది.

క్లుప్తంగా

నిబంధనలు పాటించకపోతే చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

అనంతపురం సెంట్రల్: రహదారి నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. శనివారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టి 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై మొత్తం 78 కేసులు నమోదు చేసి రూ.6.73 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు జిల్లాలో నిరంతరం వాహన తనిఖీలు జరుగుతాయని ప్రకటించారు.

దేవ ప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: జర్నలిస్టులు దేవ ప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలనిఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పయ్యావుల ప్రవీణ్ మాట్లాడుతూ.. దేవ ప్రసాద్ నిజాయతీగా పని చేశారని తెలిపారు. ఆయన చివరి రోజుల్లో కూడా ప్రెస్‌క్లబ్‌లో సేవలందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు భోగేశ్వర రెడ్డి, జయరాం, జగదీష్, డానీల్, రమేష్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి తిరు కల్యాణం

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికత, ఆరోగ్యాన్ని పెంచే శ్రీవిష్ణు సహస్రనామ సత్సంగం ఏర్పడి 26 ఏళ్లవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సత్సంగం ప్రతినిధి మేడా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8 గంటల నుంచి సాగే శ్రీవారి తిరు కల్యాణోత్సవ వేడుకల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం కల్చరల్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ జరిగింది. రోటరీక్లబ్ అధ్యక్షుడు భవాని రవికుమార్ నేతృత్వంలో అనంతపురం క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడా రామలక్ష్మి, సోమశేఖరెడ్డి తదితరులు హాజరయ్యారు. యువత సేవాభావాన్ని అందిపుచ్చుకోవాలని, అపుడే సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కేశవరెడ్డి, గల్లా హర్ష తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు చైర్‌పర్సన్ నిర్మల మురళీ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద మహిళలకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. సంఘమిత్ర కాలనీకి చెందిన అశ్వర్థమ్మ అనే మహిళ కూతురు ప్రవల్లిక పుట్టుకతో ఓ కిడ్నీతోనే జీవిస్తోంది. కూలి పనులు చేసుకుంటూ పూట గడవడం కష్టంగా మారిన కుటుంబానికి పుట్టినిల్లు ఆశ్రమం వారు అండగా నిలిచారు. 33 రకాల నిత్యావసరాలు అందజేశారు.

ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతం చేయాలి




క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతం చేయాల్సిన అవసరం చాలాఉందని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముచ్చుకోట సురేష్ బాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జార్జ్, మంజుల, చాంద్ బాషా, పురుషోత్తం, కాసమ్మ, మునిస్వామి, శివశంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 26 నుంచి 31 వరకు బడ్జెటరీ నిధుల పెంపు, ప్రభుత్వ విద్యా సంస్థల అభివద్ధి, విద్యా వ్యాపారం రద్దుకు డిమాండ్ చేస్తూ కాంపెయిన్ నిర్వహించాలని వక్తలు పిలుపునిచ్చారు. తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు వర్తింపజేయాలని కోరారు. బడ్జెట్ కేటాయింపులు జరిపి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

భయపెడుతున్న స్పీడ్ బ్రేకర్లు

- వీధుల్లో ఇళ్ల ముందు ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- అదుపుతప్పి గాయాలపాలవుతున్న వాహనదారులు
- తొలగించాలని స్థానికుల డిమాండ్



రాప్తాడు ఇందిరమ్మ కాలనీ సమీపంలో వేసిన స్పీడ్ బ్రేకర్



రాప్తాడులోని ఓ వీధిలో అనధికారికంగా వేసిన స్పీడ్ బ్రేకర్

రాప్తాడు: వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు (వేగ నిరోధకాలు) ప్రమాదాలకు హేతువుగా మారుతున్నాయి. వాహనాలపై వెళ్లే వారు స్పీడ్ బ్రేకర్స్ వల్లే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మండలంలో కొంతమంది అనుమతులు తీసుకోకుండా ఇళ్ల ముందు ఇష్టారాజ్యంగా వీటిని ఏర్పాటు చేసేసుకుంటున్నారు. పలు మార్గాల్లో వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకుని నిర్దేశిత పరిమాణంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. ప్రమాణాలను దృష్టిలో పెట్టుకోకుండా ఎత్తుగా వేయడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు అదుపు తప్పుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనాలపై వచ్చే వారికి ఎత్తుగా ఉండే స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఆ మార్గంలో కొత్తగా వచ్చే వారికి అవి ఎక్కడ ఉన్నాయో తెలియక పోవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

రంగు లేకపోవడమే ప్రమాదాలకు కారణం

స్పీడ్ బ్రేకర్లు వేసినప్పటి నుంచి తెలుపు, నలుపు రంగులతో పాటు రేడియం స్టిక్కర్లు వేయకపోవడంతో దగ్గరికి వచ్చే వరకూ అవి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అటు అధికారులు, ఇటు నాయకులు కానీ వాటిని పట్టించుకకోక పోవడంతో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ప్రమాణాలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలను (స్పీడ్ బ్రేకర్లు) తొలగించాల్సి ఉంది. వాహనదారులకు కనిపించేలా వాటికి తెలుపు, నలుపు రంగులు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పాడవుతున్న వాహనాలు

ఎత్తుగా వేసిన వేగ నిరోధకాల (స్పీడ్ బ్రేకర్లు) వల్ల వాహనాలు పాడవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలపై వస్తున్నప్పుడు అవి ఎక్కడ ఉన్నాయో తెలియక పోవడంతో ఒక్కసారిగా అక్కడికి వచ్చే సరికి సడన్ బ్రేక్ వేయడమో లేక ఎత్తుగా ఉండే వాటిని ఢీకొట్టడమో జరుగుతోందని చెబుతున్నారు.

ఎక్కడెక్కడ వేయాలంటే..

స్పీడ్ బ్రేకర్లు వాస్తవానికి స్కూల్ జోన్ ప్రాంతాలు, రెండు లేదా నాలుగు లైన్ల రోడ్డు జంక్షన్ పాయింట్ల వద్ద, దేవాలయాలు, పాదచారులు రోడ్డు దాటేందుకు నిర్దేశించిన ప్రాంతాలకు సమీపంలో ఆ మార్గంలో వాహనాలు వేగంగా రాకుండా నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తారు. అది కూడా పోలీసులు, పంచాయతీ అధికారుల సమన్వయంతో ఏయే ప్రాంతాల్లో ఏ పరిమాణంలో నిర్మించాలో నిర్ణయిస్తారు. వాటిపై, తెలుపు, నలుపు రంగులు వేయడంతో పాటు రేడియం స్టిక్కర్లు కూడా అతికిస్తారు. అందువల్ల అవి ప్రమాదాల నియంత్రణకు దోహదపడతాయి.

అధికారులు స్పందించాలి



రాప్తాడులోని వీధుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వస్తున్నప్పుడు స్పీడ్ బ్రేకర్లను గుర్తించలేక అదుపుతప్పి కింద పడిపోయి గాయాల పాలవుతున్నాం. అనధికారికంగా స్పీడ్ బ్రేకర్స్ వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి.

– చిరుతల నాగేంద్ర, రాప్తాడు

గాయాలపాలవుతున్నాం



మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు అనధికారికంగా వెలిశాయి. స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చిన్మయనగర్, ఇందిరమ్మ కాలనీలో అనధికార స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నేను కూడా స్పీడ్ బ్రేకర్స్ వల్ల అదుపుతప్పి కింద పడిపోయాను. ద్విచక్ర వాహనదారులను దృష్టిలో ఉంచుకుని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వరంధామ రెడ్డి, చిన్మయనగర్

కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తాం



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీలో కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రాధాన్యత కల్పిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని యువజన విభాగం నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీకి అనుబంధంగా యువజన విభాగం బలమైన శక్తిగా తయారు కావాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే నాయకత్వం బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రాజకీయాల్లో ఉన్న వారెవరైనా ప్రజల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీకి యువజన విభాగం సైన్యంలా పని చేయాలన్నారు. కూటమి నేతల్లో అప్పుడే విభేదాలు వచ్చాయని.. ప్రతి విషయంలోనూ అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. చివరకు స్టోర్ డీలర్‌షిప్ విషయంలోనూ వాళ్లలో వాళ్లే కొట్లాడుకుంటున్నారన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా, వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుదామన్నారు. సమావేశంలో యువజన విభాగం నాయకులు శ్రీనివాస్, గురుదత్తా, లోక్‌నాథ్ రెడ్డి, బుల్లే నాగార్జున, డివిజన్ల వారీగా నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో మహాకుంభాభిషేకం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొలిసారి నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వేదికగా సహస్రఘట మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో బ్రోచర్ల ఆవిష్కరణ, సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టపర్తి రమణారెడ్డి, ప్రధాన అర్చకులు ఏఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో పెద్ద ఎత్తున కుంభిషేకం జరుగుతుందన్నారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్యస్వామి నేతృత్వంలో వందలాది మంది వేదపండితులు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. దేశంలోని అన్ని జీవనదులతో పాటూ పవిత్ర తిరుమల జలాలతో 1,008 కుంభాలతో భక్తులతోనే స్వయంగా అభిషేకం జరిపిస్తామన్నారు. అదేవిధంగా శోభాయాత్ర, స్వామివారి ప్రవచనం, సాంస్కృతిక సంబరాలుంటాయని పేర్కొన్నారు. కుంభాభిషేకంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, గోపాల్, గుప్తా, ఫ్లెక్స్ రమణ తదితరులు పాల్గొన్నారు.

సద్విమర్శలకు మార్గనిర్దేశం రాజారాం రచనలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ కవులు

అనంతపురం కల్చరల్: సద్విమర్శలకు మార్గదర్శకంగా రాజారాం రచనలుంటాయని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం స్పందన అనంత కవుల వేదిక, కవి సంగమం సంయుక్త ఆధ్వర్యంలో రాజారాం రచించిన పూల మీద వాలిన తేనెటీగ పుస్తకావిష్కరణ జరిగింది. ప్రముఖ విమర్శకుడు లక్ష్మీనరసయ్య, డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ, యాకూబ్, డాక్టర్ అంకె శ్రీనివాస్, చం.శాస్త్రి తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రతి కవిత్వ విమర్శ ఒక ఆత్మకథగా, సృజనాత్మకత నుంచి సాంకేతికత వైపు నడిపించేలా వ్యాసాలు ఉన్నాయని తెలిపారు. కవిత్వ విమర్శ చాలా హుందాగా అందరిని చదివించేలా ఉందన్నారు. విషయం విస్మరించని.. వినయాన్ని దాటని సున్నిత విమర్శకుడు రాజారాం అన్నారు. సౌందర్యం, మానసిక సంఘర్షణలను అద్భుతంగా విశ్లేషిస్తూ రాసిన పుస్తకాన్ని అందరూ చదవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి కవులు నాగేంద్ర, నర్సిరెడ్డి,చెట్ల ఈరన్న, డాక్టర్ ప్రగతి, రఘునాథరెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు యోగి వేమన



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు



వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆర్ట్స్ కాలేజ్ వద్ద వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న రెడ్డి కులస్తులు



మాట్లాడుతున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి



యోగి వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాయలసీమ రెడ్డి జన సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్/అనంతపురం/రాప్తాడురూరల్: ప్రజాకవి వేమన జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న వేమన విగ్రహం వద్ద రెడ్డి సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటూ వందలాది మంది నివాళులర్పించారు. కార్యక్రమంలో యోగి వేమన రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, డిప్యూటీ మేయర్ విజయభాస్కర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, అనంత చంద్రారెడ్డి, యోగా కేంద్రం అధ్యక్షుడు మేళవాయి రాజశేఖరరెడ్డి, మహానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషాద్రిరెడ్డి, వడ్డుపల్లి గోపాలరెడ్డి, అశ్వర్థరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో..

జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనంలో ఆదివారం యోగి వేమన జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వసుంధర, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వేమన ఫౌండేషన్ కార్యాలయంలో..

వేమన ఫౌండేషన్ కార్యాలయంలో ఎస్కేయూ మాజీ వీసీలు హుసేన్‌రెడ్డి, కాడా రామకృష్ణారెడ్డి, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తదితరులు వేమన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య బయారెడ్డి, రవీంద్రారెడ్డి, సామాజిక నాయకులు కేవీ రమణ, మనోహరరెడ్డి, కవి టీవీరెడ్డి, నాగేశరెడ్డి, కృష్ణారెడ్డి, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో

రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని యోగి వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయలసీమ రెడ్డి జన సంఘం గౌరవ అధ్యక్షుడు చిన్నరాసి చంద్రమౌళి రెడ్డి, కార్యదర్శి దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, సభ్యులు నందికొట్కూరు రమణారెడ్డి, జూటూరు శ్రీనాథ్ రెడ్డి, ముదిగల్లు దయానంద రెడ్డి, పోతిరెడ్డి, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వే షురూ

- నేటి నుంచి అనంతపురం రూరల్ తాటిచెర్లలో భూముల రీసర్వే
- నాలుగు బృందాలను నియమించిన అధికారులు

రాప్తాడురూరల్: భూముల రీసర్వే మళ్లీ మొదలుకానుంది. ఒక్కో మండలంలో ఒక్క గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో భూ సర్వే పూర్తయితే ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని వాటిని పరిష్కరించిన తర్వాత తక్కిన గ్రామాల్లో అమలు చేయనున్నారు. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో సోమవారం నుంచి రీ సర్వే జరగనుంది. రెండు రోజుల క్రితం తహసీల్దార్ మోహన్‌కుమార్, మండల సర్వేయర్ రఘునాథ్, వీఆర్‌ఓ మంజునాథ్ గ్రామసభ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. మొత్తం నాలుగు సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్‌ఓ, ఒక గ్రామ సహాయకుడు ఉంటారు. తాటిచెర్ల రెవెన్యూ పొలంలో ఉన్న మొత్తం 342 సర్వే నంబర్లలో 4,083.83 ఎకరాల భూములు ఉన్నాయి. పట్టా భూములు 3,334.71 ఎకరాలు, అసైన్డ్ భూములు 304.8 ఎకరాలు, పొరంబోకు భూములు 118.38 ఎకరాలు, దేవదాయ భూములు 25.75 ఎకరాలు, సీలింగ్ భూములు 25.58 ఎకరాలు ఉన్నాయి. మొత్తం 903 మంది రైతులు ఉండగా.. సర్వే పూర్తయ్యేందుకు దాదాపు 45 రోజులు పట్టే అవకాశం ఉంది.

రైతులు సహకరించాలి

పైలెట్ ప్రాజెక్ట్‌గా మండలంలో తాటిచెర్ల గ్రామంలో నేటి నుంచి సర్వే చేపడుతున్నాం. నాలుగు బృందాలను నియమించాం. రైతులందరూ సహకరించాలి. సర్వే పూర్తయితే భూములకు పూర్తి రక్షణ ఉంటుంది. భవిష్యత్తులో భూముల హద్దులపై ఎలాంటి వివాదాలు ఉండవు. ఇదో మంచి కార్యక్రమం.

– మోహన్‌కుమార్, తహసీల్దార్ అనంతపురం రూరల్

సాకర్యాల కల్పనకు చర్యలు



పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రహరీకి రంగులు వేసిన దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ ఈఓ బాబు తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల ఆదేశాలతో ప్రహరీకి రంగులు వేయించినట్లు పేర్కొన్నారు. ఆలయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని వెల్లడించారు.

'సీబీఎస్ఈ సిలబస్ ప్రతిపాదన సరికాదు'

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) రాష్ట్ర కార్యదర్శి మహేష్ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ విద్యా వ్యవస్థలో మార్పులు చేయడానికి కొన్ని ప్రతిపాదనలు తయారు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యావ్యవస్థలో మార్పులు చేయాల్సిన పని ప్రభుత్వానిది కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యావేత్తలు, మేధావులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలతో చర్చించి అభిప్రాయాలను సేకరించి విద్యా వ్యవస్థలో మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్ బోర్డు సిలబస్‌ను తొలగిస్తూ దాని స్థానంలో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన సముచితం కాదన్నారు. అలాగే మాతృభాష మాధ్యమంలో విద్యా బోధనను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, ఒకవైపు తెలుగు భాషను రెండో భాషగా చెబుతూ మరోవైపు రెండో భాషగా ఏ సబ్జెక్ట్ అయినా ఎంచుకోవచ్చని చెప్పడం అంటే తెలుగు భాష అధ్యయనాన్ని తొలగించడమే అవుతుందన్నారు. నారాయణ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో చర్చించి, వారు సూచించిన ప్రతిపాదనలకు అనుగుణంగా మొత్తం ఇంటర్ విద్యా వ్యవస్థనే మార్చడానికి ప్రయత్నిస్తున్నారన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ పంచకుండీ హోమం



అలంకరణలో వాసవీమాత

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి మాలధారణ సందర్భంగా ఆదివారం వాసవీ పంచకుండీ హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు అమ్మవారి హోమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వాసవీ మాత నామస్మరణతో మందిరం పరిసరాలు మార్మోగాయి. వాసవీ దీక్షా సమితి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవలు, కన్యక పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండాల వద్ద పంచ సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా హోమాన్ని జరిపించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, అన్నదానం జరిగాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కొత్తూరు అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, నాగభూషణ, మురళీకృష్ణ, నాగరాజ గుప్తా, కిషోర్ కుమార్, సతీష్, దీక్షా సమితి అధ్యక్షుడు సుకుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శాంతి మార్గంలో జీవించాలి



ఇస్తెమాలో పాల్గొన్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: నార్పల మండల కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇస్తెమాలో మేయర్ వసీం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫారూక్ మౌలానా ప్రసంగిస్తూ.. మహమ్మద్ ప్రవక్త శాంతి మార్గం గురించి వివరించారు. ఇతరుల పట్ల శాంతి, ప్రేమ కలిగి ఉండాలని సూచించారు. మేయర్ వసీం మాట్లాడుతూ వేలాది మందితో జిల్లాలో ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, సలీం, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో గిరిజన ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యాభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడానికి పని చేద్దామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరామి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్ నారాయణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేగావత్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అనంతపురం: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్ర నాథ్ యాదవ్ తెలిపారు. సంగమేశ్వర సర్కిల్ సమీపంలోని వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న హేమలత ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న బాషా చెత్తను వేస్తూ ఇబ్బందులకు గురి చేశాడు. చెత్త తీయాలని చెప్పినందుకు హేమలతపై దాడి చేస్తూ కులం పేరుతో దూషించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు బాషాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కరుణించు.. సుబ్రహ్మణ్యేశ్వరా



స్వర్ణముఖ కవచాన్ని ఊరేగిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి మంగళ స్నానాల అనంతరం పంచామృతాభిషేకాలు, ఆకుపూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో విగ్రహాన్ని అలంకరించారు. స్వామి వారి స్వర్ణకవచాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు చేపట్టారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి పూజల అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.